# పాణ్యం ఉపఎన్నిక : కొన్ని ప్రశ్నలు

ప్రజలారా !

పాణ్యం ఉపఎన్నిక ముగిసింది. అసెంబ్లీ సభ్యత్వం లేకుండ ముఖ్యమంత్రిగా ఉన్న విజయభాస్కరరెడ్డి ఇప్పుడు శాస్త్రోక్తంగా ప్రజా ప్రతినిధి అయ్యాడు. 'ప్రశాంతంగా పోలింగ్, భారీగా రిగ్గింగ్' అన్న దినపత్రికల పతాక శీర్షికతో ఈ కర్మకాండ ముగిసింది.

ఇప్పుడింక మీరు చెప్పబోయేది ఏమిటని అడుగుతారేమో. చెప్పవలసిన విషయాలు చాలా ఉన్నాయని మేము అనుకుంటున్నాము. ఎవరో ఒకరు ఏదో విధంగా గెలిచి ఏదో రకంగా పరిపాలించడం ప్రజాస్వామ్యం కాదు. ఎన్నిక ప్రజాభీష్టాన్ని ప్రతిఫలించాలి. పరిపాలన ప్రజాస్వామ్య విలువలను ప్రతిఫలించాలి. అప్పుడే దానిని ప్రజాస్వామ్యం అనగలం. దొంగవోట్లు వేసుకోవడం, రిగ్గింగ్ చేసుకోవడం మాత్రమే కాదు ఎన్నికల చట్టానికీ ఎన్నికల కమీషన్ కళ్లకూ కనిపించని అనేక ఇతర విషయాలలో కూడ పాణ్యం ఎన్నిక ప్రజాభీష్టానికి ప్రతిఫలనం అనిపించుకునే అర్హత పోగొట్టుకుంది. 'దీనిలో కొత్త ఏముంది - ఎప్పుడూ జరిగేదే' అనే పద్ధతిలో పోలీసుల నుండి రిటర్నింగ్ ఆఫీసర్, ఎన్నికల పరిశీలకుల దాకా అధికార యంత్రాంగ మంతా ఉదాసీనత ప్రదర్శించినా, ప్రజలు ఉదాసీనంగా ఉండడానికి వీలులేదు. 'ఎప్పుడూ జరిగేదే' అయినా అన్యాయం అన్యాయమే. దానికి అలవాటుపడి పోయి ఊరుకుంటే మన హక్కులను చేజేతులా ఈ రౌడీ పాలకులకు పాదాక్రాంతం చేసిన వాళ్లమవుతాము.

'పెద్దాయన' కోసం పాణ్యం సీటు ఖాళీ చేసి ఇచ్చిన రాంభూపాల్ రెడ్డి 'ఆయన చలవ వల్లే నేను ఎం.ఎల్.ఏ. నయ్యాను. కాబట్టి నా సీటు ఇచ్చి అత్యధిక మెజారిటీతో గెలిపిస్తాను' అని ఆనాడే ప్రకటించాడు. ఎన్నికలనేవి ఉన్నంత వరకు ఎవరయినా ప్రజల చలవ వల్లనే ఎం. ఎల్.ఏ. అవుతారనుకుంటాం. ఆయన చలవ వల్ల ఈయన గెలవటమేమిటి, ఆయనను ఈయన అత్యధిక మెజారిటీతో గెలిపించడమేమిటి? అంటే సీటు అప్పగించినప్పుడే దానితో బాటు దొంగవోట్ల హామీ కూడ ఇచ్చినట్టే కదా? ఏప్రిల్ 3వ తేదీన రాంభూపాల్ రెడ్డి బనగానపల్లెలో తన అనుచర గణంతో బీభత్సంగా బూత్‌లు ఆక్రమించుకుని, రిగ్గింగ్ చేసినప్పుడే అక్రమాలు ప్రారంభమయినట్టు అనుకోవాలా లేకపోతే సీటు అప్పగించినప్పుడే ప్రారంభమయినట్టు అనుకోవాలా?

'నాకు వోటు వేస్తేనే రాయలసీమకు అభివృద్ధి దక్కుతుంది' అని తాను నామినేషన్ వేసిన నాడే విజయభాస్కరరెడ్డి బహి రంగ ప్రకటన చేసారు. అధికారంలోలేని వ్యక్తి ఆమాట అంటే దానికి అర్థం ఉంది. నాకు అధికారం ఇస్తే నేను మంచి చేస్తానని హామీ ఇస్తున్నాడని అర్థం చేసుకోవచ్చు. కాని ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ఆ మాట అంటే అది బెదిరింపు కాదా? విజయభాస్కరరెడ్డి ఓడిపోయినా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతుంది. ఆయన ఓడిపోతే పాణ్యం వాసులు దేశ పౌరులు కాకుండ పోతారా? వాళ్ల అభివృద్ధి కోసం కృషి చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం పైన లేకుండా పోతుందా? ఈ రకంగా బెదిరించి వోట్లు వేయించుకోవడం ఎన్నికల చట్టం (ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951) సెక్షన్ 123 (2) (ఎ) క్రింద నేరమెందుకు కాదు? తనకు వోటు వేయకపోతే వోటర్లకు హాని జరుగుతుందని (అది ఏ విధమయిన హాని అయినా కావచ్చు) బెదిరిస్తే అది అవినీతి చర్య క్రిందికి వస్తుందని ఆ సెక్షన్ అంటుంది. అవినీతి చర్యకు పాల్పడితే ఎన్నిక చెల్లదని సెక్షన్ 100 (బి) అంటుంది.

పాణ్యం ఎన్నికను దగ్గరుండి పరిశీలించిన వారందరూ గమనించినదేమంటే కాంగ్రెసేతర అభ్యర్థులకు అతికొద్ది గ్రామాలను మినహాయిస్తే వేరే ఎక్కడా స్థానిక ఏజెంట్లు లేరు. ఎందుకు లేరంటే వాళ్ల పట్ల ప్రజలకు ఎంత మాత్రం అభిమానం లేక కాదు. కాంగ్రెసేతర అభ్యర్థుల సభలకు ప్రజాదరణ బాగా లభించిందని పత్రికలే రాసాయి. మరి స్థానికులెవ్వరూ ఏజెంట్లుగా ఎందుకు కూర్చోలేదంటే దానికి కారణం 'టెర్రర్'. కూర్చుంటే ఏమవుతుందంటే 'కాళ్లు చేతులు నరుకుతారు' అని దాదాపు ప్రతి గ్రామంలోను ప్రజలు మా నిజనిర్ధారణ కమిటీతో అన్నారు. ఏజెంట్లుగా కూర్చుంటే కాళ్లు, చేతులు నరుకుతారు. కాంగ్రెసేతర అభ్యర్థుల ప్రచారంలో పాల్గొంటే కాళ్లు చేతులు నరుకుతారు. వాళ్ల ప్రచారానికి సహకరిస్తే కాళ్లు చేతులు నరుకుతారు. వాళ్లకు కనీసం తిండిపెట్టినా నీళ్లిచ్చినా కాళ్లు చేతులు నరుకుతారు.

ఎవరు నరుకుతారు? కాంగ్రెస్‌కు చెందిన సాయుధ ముఠా నాయకులు. సాయుధ ముఠాలను వెంట వేసుకొని రాయలసీమ ప్రజల జీవితాలను భూతాలయి పీడిస్తున్న ఫాక్షనిస్టులు. సారాయి వ్యాపారంతో, రౌడీ మామూళ్లతో, బలవంతపు వసూళ్లతో కోట్లు సంపాదించి అందులో కొంత భాగాన్ని రాజకీయాధికారం కోసం వెచ్చించి 'ప్రజాప్రతినిధులు' అన్న బోర్డు తగిలించుకొని తిరుగుతున్న మాఫియా నాయకులు. వాళ్ల చెప్పినట్టు ప్రజలు వినాలి. వాళ్ల ఆదేశం ప్రకారం నడుచుకోవాలి. వాళ్లు తెలుగుదేశం పార్టీలో ఉంటే ఆ పార్టీకే వోటు వేయాలి, వాళ్లు కాంగ్రెస్‌లో ఉంటే కాంగ్రెస్‌కే వోటు వేయాలి. లేకపోతే 'కాళ్లు చేతులు నరుకుతారు'. పెట్టెలో వోటు వేసేముందు తమ ఏజెంటుకు చూపించి వేయాలని కూడ ఈసారి వాళ్లు వోటర్లకు ఆంక్ష జారీ చేశారు. ఆ ఆంక్షను గౌరవించనందుకు కైప గ్రామంలో ఒక వోటరు పైన దౌర్జన్యం చేసి విపరీతంగా కొట్టారు. ఇదెక్కడి అన్యాయమని కాంగ్రెసేతర అభ్యర్థి సంధ్య ఏజెంటయిన గంగాభవాని ప్రశ్నించగా ఆ గుండాలు ఆమె పైన కూడ పడి విపరీతంగా కొట్టారు.

ఈ ముఠాల బెదిరింపు విజయ భాస్కరరెడ్డి విజయానికి ప్రధాన సోపానం అయింది. ఇతర అభ్యర్థులకు స్థానిక ప్రచార కార్యకర్తలు లేకుండా చేసారు. స్థానిక ఏజెంట్లు లేకుండా చేసారు. బయటి వాళ్లను ఏజెంటుగా పెట్టుకుంటే ఆవుల దొడ్డి, కామగానికుంట్ల, శ్రీరంగాపురం గ్రామాలలో కూడ కిడ్నాప్ చేసి బూతులు తిట్టి బలవంతంగా నిర్బంధించారు. బోగోలు, చెరుకులపాడు గ్రామాలలో ఏజెంట్లను చుట్టుముట్టి తరిమేసారు. ...యిన వారిగురించి ప్రత్యక్ష వివరాలు వెల్దుర్తి ఎస్ ఐ. యుగంధర్‌కు, డోన్ సి.ఐ. సయ్యద్ వలీకి చెప్పినా వాళ్లు నిమ్మకు నీరెత్తినట్టు

ఉండిపోయారు. కిడ్నాప్ అయిన వారి ఆచూకీ కాకతాళీయంగా కనుక్కున్న తెలుగుదేశం నాయకులే వారిలో కొందరిని కాపాడారు. ఆ తరువాత విధిలేక పోలీసులు రంగంలోకి దిగి మిగిలిన వారి కోసం వెతికారు.

ఈ రకంగా ప్రత్యర్థులను భయభ్రాంతులు చేసి కాంగ్రెస్ నాయకులు ప్రతి ఊరిలోనూ జీపులు, ట్రాక్టర్లు పెట్టి జనాన్ని చట్ట విరుద్ధంగా పోలింగ్ బూత్ ల దగ్గరికి తరలించి తీసుకొచ్చారు. ఇది మరొక అవినీతి చర్య అని ఎన్నికల చట్టం సెక్షన్ 123 (5) స్పష్టంగా అంటుంది. అయినా ఇది ఏప్రిల్ 3వ తేదీన పాణ్యం అంతటా బాహాటంగా జరిగింది. పత్రికలు ఫోటోలు సహితం వేసాయి. ఈ విధంగా తరలించిన జనంలో కొందరు కాంగ్రెసేతర అభ్యర్థులకు వోటు వేసి ఉండరా అంటారేమో, వేసి ఉండవచ్చు. కానీ అత్యధికులు మట్టుకు తెలిస్తే చావగొడతారన్న భయానికి (పైగా వోటు చూపించి పెట్టెలో వేయాలన్నారు కదా!) కాంగ్రెస్‌కే వేసి ఉంటారు. ఆవిధంగా జరుగుతుంది కాబట్టే వాహనాలలో తరలించడం అవినీతికర చర్య అని చట్టం గుర్తించింది. కానీ చట్టాన్ని అమలు చేసేవారు గుర్తించాలి కదా!

తోలుకొచ్చిన జనం చేత తమ వోట్లు వేయించడమే కాక దొంగవోట్లు కూడ చాలా వేయించారు. బయట నియోజక వర్గాల నుండి జనాన్ని లారీలలో తరలించి తీసుకొచ్చి వెల్దుర్తి మండలంలోను ఇతర మండలాలలో కొన్ని ప్రాంతాల లోనూ పెద్ద సంఖ్యలో దొంగవోట్లు వేయించారు. 'పెద్దాయన' ఊరికే గెలిస్తే చాలదు కదా? గతంలో పి.వి. నరసింహారావు నంద్యాలలో గెలిచినట్టు అధిక మెజారిటీతో గెలవాలి. అప్పుడు చేసినట్టు కొద్ది మంది బూత్ లు ఆక్రమించుకొని వోట్లన్నీ గుద్దుకోవడం ఈసారి సాధ్యపడదనుకున్నారు. కాబట్టే దొంగవోట్లు పెద్ద ఎత్తున వేయించారు. కర్నూలు, డోన్, అవుకు, ఆళ్లగడ్డ ప్రాంతాలనుండి లారీలలో, టూరిస్టు బస్సులలో దొంగవోటర్లను తరలించారు. ఈ విషయం అందరికీ కనపడుతూనే ఉంది. అందరూ చూస్తూనే ఉన్నారు. అధికార పార్టీకాక వేరే ఎవరయినా అయితే పోలీసులు ఆ లారీలనూ బస్సులనూ ఆపి వెనక్కి పంపేవారు. కానీ ఇది హస్తం మహత్యం అయ్యే సరికి మిన్నకుండి పోయారు.

దొంగవోట్లకు సంబంధించినచట్టం కూడ దొంగలకే అనుకూలంగా ఉంది. దొంగ వోట్లను నిరోధించాలని ఎన్నికల చట్టం సెక్షన్ 61 అంటుందిగానీ, దొంగవోట్లు వేయడం అంటూ జరిగితే దానివల్ల ఎన్నికల ఫలితానికి తేడా వచ్చేటట్టయితేనే ఆ ఎన్నిక రద్దువుతుంది తప్ప లేకపోతే కాదనిసెక్షన్ 100(డి)(3) అంటుంది. అంటే అవినీతి కాదు, దాని రాశి ఇక్కడ ప్రధానం. కాబట్టే ఒకే వ్యక్తి డజను వోట్లు వేసిన ఉదంతాలూ, నియోజక వర్గానికి చెందని వాళ్లు లైనుకట్టి వందల వోట్లు వేసిన ఉదంతాలూ నిర్దిష్టంగా రిటర్నింగ్ ఆఫీసర్ దృష్టికి తెచ్చినా, ఒక దొంగవోటరును రేణుకాచౌదరి స్వయంగా పట్టుకొని బయటకు ఈడ్చుకొచ్చిన ఫోటోను పత్రికలు ప్రచురించినా, వాటివల్ల ఎన్నికల ఫలితానికేమీ తేడా రాదని చెప్పి రిటర్నింగ్ ఆఫీసర్ కొట్టి పారేయగలడు.

ఇదిచట్టంలోని లోపమే అనుకున్నా, రిగ్గింగ్ విషయంలో చట్టం స్పష్టంగా ఉంది కాదా? బూత్ లు ఆక్రమించుకోవడం ఎన్నికను రద్దుచేసే చర్యఅని సెక్షన్ 58-ఎ , 123 (8) ఏ మినహాయింపు లేకుండ అంటాయి. మరి రాంభూపాల్ రెడ్డి, శేషశయనారెడ్డి, ఫకీర్ రెడ్డి, వారి అనుచరులు బనగానపల్లి, పాణ్యం మండలాలలో అనేక చోట్ల రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. బూత్ నంబర్లతో సహా ఆసాయంత్రమే మా రెండు సంస్థలు రిటర్నింగ్ ఆఫీసర్ మనమోహన్ సింగ్‌కు ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. పాణ్యంలో అయిదు బూత్ లలో రిగ్గింగ్ జరిగినట్టు ఎంఆర్ వో స్వయంగా రిపోర్టు రాసాడు. వీటి మీద ఏరకమయిన విచారణ జరపకుండ ఎన్నికల అధికార్లు ఆ సాయంత్రమే 'ఫిర్యాదులలో ఏమాత్రం వాస్తవం లేద'ని ఏవిధంగా కొట్టేయగలిగారు? శేషన్ మీద విజయభాస్కరరెడ్డి అనవసరంగా విరుచుకుపడ్డారు గానీ, పైకి ఏం మాట్లాడినా చూసీ చూడనట్టు పోయే ఎన్నికల అధికార్ల వైఖరి కదూ ఆయనను కాపాడింది.

ఇక్కడ సమస్య ఎవరు గెలుస్తారనేది కాదు. ప్రజలు ఇష్టపడి విజయభాస్కరరెడ్డినే గెలిపించుకుంటే ఎవ్వరూ అభ్యంతరం చెప్పరు. ఆ ఇష్టపడే స్వేచ్ఛ ప్రజలకు ఉండాలంటున్నాం. తమకు ఇష్టమున్న అభ్యర్థికి వోటు వేసే హక్కే కాదు బహిరంగంగా పనిచేసే హక్కు కూడ ప్రజలకు ఉండాలంటున్నాం. ఈ హక్కు కోసం సూత్రబద్ధంగా నిలబడి పోరాడాలంటున్నాం. తెలుగుదేశం నాయకులలాగ తమకు బలం ఉన్న చోట తాము కూడ అక్రమాలకు పాల్పడుతూ బలం లేని చోట ప్రజాస్వామ్యాన్ని గురించి మాట్లాడే వైనం కాక, ఒక ప్రజాస్వామిక విలువగా ప్రజల రాజకీయ స్వేచ్ఛను కాపాడుకోవాలని కోరుతున్నాం. రాయలసీమకు సంబంధించినంత వరకు ఈ రాజకీయ స్వేచ్ఛకు ప్రధాన శత్రువు సాయుధ పెత్తందారీ ఫాక్షన్ల ఆధిపత్యం. వాళ్లు ఊరూరా నడుపుతున్న సమాంతర పాలన, వారి రౌడీ రాజ్యం. దీనిని అంతం చేయడానికి పోరాడనిదే రాయలసీమ ప్రజలకు రాజకీయ స్వేచ్ఛ లేదు. ప్రజాస్వామ్యం లేదు.

- ఎన్నికల అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడుదాం
- రాజకీయ స్వేచ్ఛను కాపాడుకుందాం
- రాయలసీమను పీడిస్తున్న సాయుధ పెత్తందారీ ముఠాల పాలనకు వ్యతిరేకంగా పోరాడుదాం.

ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ
OPDR

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం
APCLC